# సంధ్య

● ● ●

శ్రీమతి యం. పుష్పవతీదేవి

రాత్రి ఒంటిఘంట కొవస్తూంది. వెన్నెల గుడ్డిగా ఉంది. పల్లెటూరి చడీచప్పుడు ఏమీలేదు. సంధ్య ఆపాదమస్తకమూ దుప్పటిచుట్టుకుని, నిశ్శబ్ధంగా తలుపులు తెరచుకు బయటికివచ్చింది. తలెత్తి ఓమారు కనుచూపుమేరలోఉన్న కిసన్ యింటివేపు చూసింది. ఎండాకాలం కాబట్టి కిటికీ తలుపులు తెరచే ఉన్నై. ఆయింట్లో ఎవరో యితరులుంటూన్నారు. కిసన్ మట్టుకులేడు. ఒకసంవత్సరంక్రితమే ఆ యింటిని శాశ్వతంగ విడిచిపెట్టాడని తెలుసుకుంది. చాలా ఓపికతో అటు చూస్తూండిపోయింది. ఎన్నో గతించినవిషయాలు ఆమె స్మృతిపథంలో గోచరించినై. ఒకసారి నలువేపులా పరికించిచూసింది. ఎవరూలేరు. నిశ్శబ్దంగాఉంది ప్రకృతి. అక్కడక్కడ నక్కలఅరుపులుమట్టుకు వినవస్తూన్నై. స్టేషన్ వేపు తొందరగా నడవసాగింది. హృదయంలో ఎన్నోతలంపులు దొర్లిపోతూన్నవి. గుండె బరువుగా తోచింది. హృదయం కరిగేట్టు లోలోపలే ఏడ్చింది ఒక్కొక్కసంగతి జ్ఞప్తికి తెచ్చుకుని.

మద్రాస్ టిక్కెట్ తీసుకుని బండిలో కూలబడింది...రోజంతా ఏడవటంవల్ల ఆమెకళ్లెర్రబడి ఉన్నై...తలంతా చెదరి మొగంమీద పడుతూంది ప్రపంచంలోని దుఃఖం అంతా ఆమెనే ఆశ్రయించుకున్నట్టుంది.

ఎవరమ్మాయి ? అని ప్రశ్నించింది ప్రక్కనే కూర్చున్న మరో స్త్రీ.

నేనా!—ఒకఅనాథను'—అంది గద్గదంగా.

ఎవరూలేరా! పాపం' జాలిపడుతూ ఆస్త్రీ చెప్పింది.

ఎవరున్నారు ? అందరూపోయారు!—

ఎక్కడికిపోతున్నావమ్మా!—'

సుఖదుఃఖాలు లేనిచోటికి!—" ఈమాట ఉచ్ఛరిస్తుండగా ఆమె కనుకొలుకుల్నుండి అశ్రుబింధువులు జలజలరాలినై ... ఆస్త్రీ విస్తుపోయి చూస్తూండినది.

* * *

గడియారం పన్నెండూ టంగ్ టంగ్ న కొట్టింది. కిసన్ చంద్ పుస్తకంమూసి, ముసుగుపెట్టి పండుకున్నాడు. ఒకఘంట నిశ్శబ్ధంగా గడిచిపోయింది...నిద్రమత్తులో ఎవరో తన్ను తట్టి పిలుస్తున్నట్టుగా విన్నాడు—

కళ్లు తెరవకండానే — " ఎవరూ! — అన్నాడు...

'కిసన్!—' ఈరెండోపిలుపుకు కళ్లునులుముకుంటూ లేచాడు...సంధ్య ముసుగుతోసివేసింది...! గదిలో దీపం గంటంమల్లే వెలుగుతూంది.

కిసన్ ఒకతూరి ఆమెకేసిచూసి, తనకళ్లను తనే నమ్మలేకపోయాడు.

తర్వాత గుర్తించాడు — మొదట అతనికి నమ్మకం కలుగలేదు—'ఎవరు ? —సంధ్యా '— అన్నాడు ఆశ్చర్యంతో స్థంభించిపోయి—

'అవును !_ నేనే!-'' ఏమో చెప్పబోయింది ...ఊపిరి బరువుగా వస్తూంది ... మాట్లాడలేక పోయింది...కళ్లనీళ్లు పెట్టుకుంది...కిసన్ గోడవేపు చూసాడు...గడియారం ఠరడంకొడుతూంది...నిశీథ సమయం...ఆకాశంఅంతా మబ్బులతోనిండిఉంది...

“ఎలావచ్చావు ? ఎక్కడనుండి యింత రాత్రిలో!” ఉద్వేగంతోనూ, సందేహంతోనూ

ఒక్కమారు ప్రశ్నించాడు...సంధ్య తలవంచుకుని నేలమీద కూర్చుంది. నెమ్మదిగా చెప్పింది.

'రామనగర్' నుండి

"ఇక్కడి కెలావచ్చావు? ఎలా తెలిసింది నేనిక్కడున్నానని?-" ఆవేశంతో అన్నాడు...

"ఈదినం అంతా ప్రయత్నించినమీదట తెలుసుకున్నాను."—

"నీభర్తయెక్కడ? రామనగర్ వచ్చాడా!-" కిసన్ సందేహంతో ప్రశ్నించాడు—

"నాభర్త!— చిరునవ్వు ఆమె పెదవుల మీద ఉంది..." వారం రోజులక్రితం చనిపోయారు.

"చనిపోయాడా!"-కిసన్ ఒక్కమారుగా తలపగులగొట్టుకున్నట్లైంది...

'లోకంలో అనాధను-అమ్మకూడా, పోయింది గా— నేనూ ఎంతకాలమో బ్రతకను — కళ్లనీళ్లు నిండుకొచ్చాయి. దుఃఖంతో తల రెండుచేతుల్లో పట్టుకుని, కిసన్ దాదాపు ఒకఘంటవరకూ నిశ్శబ్దంగా ఉండిపోయాడు...

శేషరాత్రంతా కిసన్ మేల్కొనేఉన్నాడు... కళ్లవెంబడి అశ్రులు రాలుతూనేఉన్నై ... సంధ్య నిద్రపోయింది ... ఆమె మొగాన్ని చూస్తూండిపోయాడు. ఎక్కడి రామనగరం! — ఎక్కడి సంధ్య!—ఆమధురమయ బాల్యం అంతా స్మృతిపథంలో గోచరిస్తూంటే గుండెపగులుతూంది. నేటికి రెండేళ్లయింది సంధ్య కాపురానికిపోయి. మరి కొన్ని నెలల్లో రామనగరాన్ని శాశ్వతంగ విడిచి వచ్చాడు కిసన్.



ఒకప్పుడు స్వర్గసీమలా కనుపించే రామనగరం...అతనికి సంధ్యపోగానే పాడుశ్మశానంలా కన్పించసాగింది. ఇంకా అక్కడి — మామిడితోపూ — పూలతోటలూ — ఆచిన్నకుటీరం చూస్తూంటే—తను సంధ్యతో గడిపిన మధురతమ క్షణాలన్ని జ్ఞప్తికివచ్చి తీరని దుఃఖం కల్గించేవి.

సంధ్య నెంత ప్రేమించేవాడు...ఆమెకోసం ఎంతదుఃఖం పొందాడు...ఆరాత్రులూ — ఆచంద్రుడూ — ఆపవిత్ర ప్రేమానుభవాలు ... గతించిపోయినై...తిరిగి మళ్లా జీవితంలో ఆక్షణాలు రావు! సంధ్య—అన్యకులాన్కి చెందింది. సమాజం ఆప్రేమికుల జీవితాల్ని ఎడబాటుచేసింది. వాళ్ల జీవనాల్ని ఆజన్మాంతం తీరని ఆవేదనా-దుఃఖంతో నింపింది—

బలవంతాన సంధ్య...తను బాల్యంనుండీ...ప్రేమిస్తూవచ్చిన...సంధ్య — పరులసొత్తయి పోయింది...కిసన్ స్వప్నాలన్నీ గాలిలో మేడలైనవి. నిరాశలో ఆవేదనపొందాడు...జీవితంఅంతా నిరర్థకము—దుఃఖమయముగా చేసుకున్నాడు. సంధ్య తల్లి చనిపోయేప్పుడు ... కిసన్ ఆమె సమక్షంలో ఉన్నాడు...కన్నతల్లి చావులో కూతురురాలేదు.... బహుశా ఆమె జీవితం ఊహించుకునే ఉంటుంది తల్లి—మృత్యుశయ్యమీద కిసన్‌తో చెప్పింది—

"బాబూ!—చిన్ననాటినుండి— దానిముద్దుముచ్చటా చూసావు — ఆటాపాటా నేర్పావు — ఏంలాభం! దానిరాతలోఉంది ... ఎంత దురదృష్టవంతురాలు నాసంధ్య! వత్తిత్రాగుబోతు. అన్నీ విన్నాను. అదిపడేబాధలన్నీ విన్నాను...ఏంచేసేది ...భగవంతుడా!—ఏనాడైనా యిలా కల్లోనైనా తలంచానా! నాయనా కిసన్! సంధ్యను ఒకకంటితో చూడు...నీకంటే వేరే దిక్కులేదు దానికి"—కిసన్ కళ్లు తుడచుకుంటూ వచ్చేడు. (సశేషం)


క్రొత్తరకాలు! క్రొత్తపోకడ!










అప్పటపు బంగారు - కష్టకాలములో కావలసినప్పుడు సొమ్ము చేసుకొనవచ్చును.

ఈ నగలు బంగారు గిల్టువేసినవికావు. లోపల లోహపు కడ్డీమీద బంగారు రేకు తొడగబడియుంది. కొద్దిఖరీదుకే ఎక్కువ నగలొస్తాయి.

మా కొతాదారులందరు మా టి. సి. యన్. గోల్డన్ మెటల్ నగలు కొన్నిసంవత్సరాలయిన తరువాత నలుపెక్కుచున్నవి. అట్లులేకుండా చేయవలసినదనివ్రాసిన లేఖలకు మేము యీ జీవితకాల గ్యారంటీ రకాలను ప్రచారంలోకి పెట్టుతున్నాము.

ఉంగరము ఒకటికి రు. 10-0-0, వి. పి చార్జీ 0-10-0.

| | | |
|---|---|---|
| పెద్దసైజు గాజులు | 2 అం. పైబడినవి జత 1-కి | రూ. 20-0-0 |
| మధ్యమసైజు గాజులు | $1\frac{3}{4}$ అం. నుండి 2 అం. లోపల జత 1-కి | రూ. 15-0-0 |
| బేబీ సైజు గాజులు | $1\frac{3}{4}$ అం. లోపల జత 1-కి | రూ. 10-0-0 |

వి. పి. చార్జీలు 0-10-0.




టి. సి. నాగలింగప్ప అండ్ కో.,

280, వాల్‌టాక్సురోడ్, పి. టి., మద్రాసు.

ఏజంట్లు:—శ్రీ కె. యస్. తిమ్మప్ప శెట్టిగారు, గోపువారి బిల్డింగ్సు, బెజవాడ.